# 11

# "ఐక్యమును కాపాడుకొనుచు మీరు పిలువబడిన పిలుపునకు తగినట్లుగా నడుచుకొనుడి"

## (4:1-3)

ఎఫెసీయులకు వ్రాయబడిన పత్రికలోని రెండవ సగ భాగము (అధ్యా. 4–6) సంఘ జీవితమునకు ఆచరణాత్మకమైన అన్వయమును సమకూర్చుతుంది. పౌలు ఇచ్చట చేయుచున్న బోధ మహిమాన్వితమైన సంఘము దేవునితో కలిగియున్న సంబంధములో దాని సదుద్దేశము గూర్చి ఆయన ఇదివరకే నివేదించిన (అధ్యాయములు 1–3) సత్యములపై ఆధారపడి యున్నది. ఆయన ఇచ్చిన ఆచరణాత్మకమైన అన్వయములను నాలుగు భాగములుగా భాగింపవచ్చును, ప్రతి భాగములో "నడుచుకొనుడి" అను విధివాచకము కలదు.[1] ఈ ఆదేశములు, సంఘ జీవితంలో ప్రయోగాత్మకంగా ప్రయోగింపబడినప్పుడు, అవి 3:14–21లోని ప్రార్థన యొక్క ప్రత్యుత్తరములను ప్రదర్శిస్తాయి.

4వ అధ్యాయంలో, వారు "పిలువబడిన పిలుపునకు తగినట్లుగా" ఎఫెసీయులు ఒక సంఘముగా నడుచుకొనవలెనని పౌలు వారిని మొదట దీనంగా బ్రతిమలాడాడు (4:1–3). అటుతరువాత, వారు దీనిని సాధించుటకు సామకూలమైన రెండు విధానముల గూర్చి ఆయన చర్చించాడు: అవేవనగా, ఐక్యము గలవారై యుండుట (4:1–16) మరియు వారి చిత్తవృత్తి యందు నూతనపరచబడిన వారగుట (4:17–32)

### పిలువబడిన పిలుపుకు తగినట్లుగా జీవించుట (4:1–3)

**1–2కాబట్టి, మీరు సమాధానమను బంధముచేత ఆత్మ కలించు ఐక్యమును కాపాడుకొనుటయందు శ్రద్ధ కలిగిన వారై, ప్రేమతో ఒకనినొకడు సహించుచు, 3మీరు పిలువబడిన పిలుపునకు తగినట్లుగా దీర్ఘశాంతముతో కూడిన సంపూర్ణవినయముతోను సాత్వికముతోను నడుచుకొన వలెనని, ప్రభువునుబట్టి ఖైదీనైన నేను మిమ్మును బతిమాలు కొనుచున్నాను.**

**వచనములు 1–3. కాబట్టి** అను పౌలు ఎఫెసీ సహోదరులకు తెలియజెప్పబోవుచున్న విషయాన్ని ఆయన తన పత్రికలో ఇదివరకే తెలియజెప్పిన విషయాలతో ముడిపెట్టుచున్నది. ఆయన తననుతాను **క్రీస్తు యేసు యొక్క ఖైదీనైన** అని సంబోధించుకొన్నాడు ఏలయనగా, ఆయన తన పత్రికను రచించుచుండిన సమయంలో, రోమా పట్టణంలోని ఒక చెరసాలలో ఖైదీయై యుండెను. ఆయన చెరసాలలో వేయబడుటకు ఆయన చేపట్టిన పరిచర్యయే హేతువను వాస్తవము ఆయన చేయుచుండిన విన్నపమునకు అదనపు బలమును ఒసంగియుండును.

పౌలు రచించిన ఇతర పత్రికలలో వలెనే, **బతిమాలుకొనుచున్నాను** (*parakaleō*), లేక "విన్నవించుకొనుచున్నాను" (NIV), అను పదము పత్రికలోని సిద్ధాంతముల విభాగము నుండి ఆచరణాత్మక అన్వయమునకు సాగుచున్న మధ్యంతర మార్పును పరిచయము చేయుటకు ఇచ్చట ప్రయోగింపబడింది (రోమీయులకు 12:1; ఫిలిప్పీయులకు 4:2; 1 థెస్సలొనీకయులకు 4:1, 10-12 చూడుము). ఈ క్రియా పదమునకు క్రొత్త నిబంధనలో మూడు ముఖ్యమైన ఉపయోగములు కలవు: (1) "సహాయము కొరకు అడుగుట, బతిమాలుట, వేడుకొనుట"; (2) "ఆదరించుటకు"; లేక (3) 1వ వచనంలో వలె, "హెచ్చరించుటకు."[2] పౌలు తన అపొస్తలత్వ అధికారమును వినియోగించుకొనుటకు కాదు, కానీ ఆయన క్రీస్తు నిమిత్తము అనుభవించుచుండిన శ్రమలు మరియు వారితో ఆయనకుండిన అవినాభావ స్నేహ బంధము ఆధారంగా తన పాఠక మహాశయులను విన్నవించుటకే ఈ పదమును ఉపయోగించాడు. ఆయన "బతిమాలుకొనుచున్నాను" అను మాటను "కాబట్టి" అను మాటతో కూడ ప్రయోగించినందునుబట్టి, ఈ పత్రికలోని మొదటి సగ భాగములో వ్రాయబడి యున్నట్లు, వారి యెడల దేవుడు చేసిన సమస్త కార్యముల ఆధారంగా, ఎఫెసీయులు నీతిన్యాయముతో కూడిన ప్రవర్తనను ప్రదర్శింపవలెనని పౌలు వారికి పిలుపు నిచ్చుచుండెను.

పౌలు క్రైస్తవుల కిచ్చుచుండిన ఉద్బోధనము – మరియు **నడుచుకొనుడి** అను మాటను మొదటిసారిగా ఉపయోగించుట – 4:1-3లో కలదు. "నడుచుకొనుడి" ("జీవించుడి" NIV) అను మాట *peripateō* యొక్క అనువాదమై యున్నది. LXXలో, ఈ క్రియా పదము *halak* అను హెబ్రీ పదము యొక్క అనువాదమై యుండి, "నీతియుక్తమైన ప్రవర్తన లేక ఒక జీవిత విధానము" అను అర్థమిచ్చుచున్నది.[3] **వారు పిలువబడిన పిలుపునకు తగినట్లుగా** వారి జీవితములను కొనసాగించవలెనని, లేక తమ్మునుతాము సంభాళించుకొనవలెనని, పౌలు ఎఫెసీయులను మందలించుచుండెను.

"తగినట్లుగా" అను మాట *axiōs*, అను పదము యొక్క అనువాదమై యుండి, "తగిన విధంగా, తగినట్లు మారుచున్న రీతిలో; *సూచింపబడిన దానికి సరిసమానమైన రీతిలో* అని అర్థమిచ్చుచున్నది."[4] మరొక చోట, క్రైస్తవులకు వ్రాయుచుండినపుడెల్లా తగినట్లు జీవించుట యను భావనను పౌలు తరుచుగా ఉపయోగించాడు. ఫిలిప్పీయులకు 1:27, 28లో, "... క్రీస్తు సువార్తకు తగినట్లుగా ప్రవర్తించుడి" అని ఆయన రచించాడు (కొలొస్సయులకు 1:9-12; 1 థెస్సలొనీకయులకు 2:11, 12 చూడుము). పలు చోట్ల సువార్త ప్రకటింపబడుట ద్వారా ప్రజలు దేవుని చేత పిలువబడుచున్నారు (2 థెస్సలొనీకయులకు 2:14); ఫలితంగా, ప్రజలు సువార్తకు విధేయతతో ప్రతిస్పందించినప్పుడు, వారు "పిలువబడినవారు" ఔతారు (రోమీయులకు 1:1-7).

**మీరు పిలువబడిన** అను మాటలు గతకాలమందు సువార్తను ప్రజల యొద్దకు తెచ్చిన దైవీకమైన చొరవను, మరియు గతకాలమందు వారు క్రైస్తవులైనప్పటి వారి కార్యశీలకమైన ప్రతిస్పందనను సూచిస్తున్నాయి. ప్రస్తుత కాలమందు వారు క్రీస్తునందు ఏమైయున్నారో దానికి తగినట్లుగా వారు జీవించవలసి యుండింది. దైవీకమైన చొరవ మరియు మానవుల ప్రతిస్పందన కవలలుగా కలిసి సంభవిస్తుంటాయి. ఒకడు క్రీస్తునందుండుట వలన కలుగు ప్రత్యేకార్హతలను అంగీకరించినప్పుడు, దేవుని పిలుపుతో కూడ కలిసివచ్చు బాధ్యతలను

సహితము వాడు అంగీకరించాలి.

పౌలు విన్నవించుకొనుచుండిన విన్నపము తన ఇష్ట ప్రకారమైనది కాదు, కానీ క్రీస్తునందుండుట వలన మరియు ఆయన శరీరములో, అనగా సంఘములో ఒక అవయవమై యుండుట వలన కలిగిన సహేతుకమైన సత్ఫలితమై యుండింది. క్రీస్తునందలి ఐక్యము కలిగియుండి తగినట్లుగా నడుచుకొనుట గూర్చి ఆయన చర్చిస్తూ (4:1–16), ఈ ఐక్యమునకు సరైన వైఖరులు ఎలా అగత్యమై ఉన్నాయో దానిని మొదట వివరించాడు.

### స్వయం యెడల సరైన వైఖరి (4:3)

**3సంపూర్ణ వినయముతోను ...**

**వచనము 3. వినయము** అను మాట *tapeinophrosunē* యొక్క అనువాదమై యున్నది, ఇది ఒకడు తన స్వయం యెడల కలిగియుండు వైఖరై యున్నది, "మనస్సులో అణకువ" అని నిర్వచింపబడింది.[5] గ్రీకులు మరియు రోమీయులు కలిసి పరిపాలించుచుండిన ఆనాటి ప్రపంచంలో, నీచత్వముతో సంబంధము కలిగియుండి, ఈ పదము వ్యతిరేకార్థకమైనదై యుండింది.[6] ఏది ఏమైనా, యూదుల ఆలోచనల్లో, "వినయము" దేవుని దృష్టిలో హెచ్చింపబడినవారై యుండిన బీదలతో సంబంధము కలిగియుండింది. క్రొత్త నిబంధనలో, వినయము తలబిరుసుతనముతో లేక గర్వముతో పోల్చబడిన తారతమ్యముగలదై యుండింది (1 పేతురు 5:5 చూడుము) మరియు విశ్వాసుల సమాజములో ఒక ముఖ్యమైన లక్షణమై యున్నది. "కక్ష చేతనైనను వృథాతిశయము చేతనైనను ఏమియు చేయక, వినయమైన మనస్సుగలవారై యొకని నొకడు తనకంటె యోగ్యుడని యెంచుడి" అని ఫిలిప్పీయులకు 2:3 సెలవిచ్చుచున్నది. చిట్టచివరి వినయము క్రీస్తు ఈ లోకములోనికి వచ్చి సకల మానవుల నిమిత్తము తన ప్రాణము నర్పించుటలో ప్రదర్శింపబడింది (ఫిలిప్పీయులకు 2:5–8).

గర్వము ఐక్యమునకు శత్రువు. విషయాలు అందరి అభిప్రాయము మరియు ఇష్టాయిష్టాలకు సంబంధించినవైనప్పటికిని, గర్వము, తన సొంత విధానలే అమలు చేయబడాలని పట్టుబట్టును. "దేవుడు అహంకారులను ఎదిరించును" (యాకోబు 4:6). ఒకడు "తన్నుతాను ఎంచుకొనతగినదాని కంటె ఎక్కువగా ఎంచుకొనకుండుటను" నేర్చుకొన్నప్పుడు (రోమీయులకు 12:3), ఒక అత్యావశ్యకమైన అడుగు ముందుకు వేయబడిందని అర్థము. ఒకడు తన స్వయం యెడల కలిగియుండు సరైన వైఖరి ఐక్యమునకు మొట్టమొదటి ఆవశ్యకమై యున్నది.

### ఇతరుల యెడల సరైన వైఖరి (4:2, 3)

**2–3... ప్రేమతో ఒకనినొకడు సహించుచు, ... దీర్ఘశాంతముతో ... సాత్వికముతో ...**

**వచనము 3. సాత్వికము** *prautēs* అను గ్రీకు మాట యొక్క అనువాదమై యున్నది, అది "వ్యక్తిగత ప్రయోజనము లేక పేరు ప్రతిష్ఠలను పట్టించుకొనకుండా, సార్వజనీన మేలును వెదకుట వలన ఏర్పడు మన్నన, ఇతరుల కష్టసుఖాల గూర్చి ఆలోచించే మనస్తత్వము, మరియు తన హక్కులను సహితము కాలరాయుటకు గల ఇష్టము" కలిసియున్న ఒక ప్రత్యేక చిహ్నమై యున్నది.[7] ఈ లక్షణము క్రీస్తు శీలములోని విలక్షణ

ప్రత్యేకతయై యుండింది (2 కొరింథీయులకు 10:1), మరియు అది **ఆత్మ** ఫలములోని ఒక భాగమై యున్నది (గలతీయులకు 5:23). సమస్యల సంకటంలో కొట్టుమిట్టాడుచుండిన కొరింథీయులతో వ్యవహరించినప్పుడు పౌలు ప్రదర్శించిన వైఖరిని ఇది వర్ణించుచున్నది (1 కొరింథీయులకు 4:21) మరియు యవ్వన సువార్తికుడైన తిమోతి తన వ్యతిరేకులను ఎదుర్కొనుచుండిన సందర్భములో అతడు సాత్వికమును ప్రదర్శించాలని పౌలు అతనికి సిఫారసు చేసాడు (2 తిమోతి 2:24-26).

**సహనము** *makrothumia* అను గ్రీకు పదము యొక్క అనువాదమై యున్నది; కానీ క్రొత్త నిబంధనలోని అనేక ఇతర వాక్య భాగాల్లో, "సహనము" *hupomonē* అను గ్రీకు పదము యొక్క అనువాదమై కూడ ఉంటున్నది. ఈ వచనంలో, *makrothumia*ను NKJV "దీర్ఘశాంతము" అని అనువదించుచున్నది. రిచర్డ్ సి. ట్రెంచ్ ఈ రెండు మాటలకు గల తారతమ్యమును ఈ క్రింది విధంగా తెలియజెప్పుచున్నాడు:

> *Makrothumia* [దీర్ఘశాంతము] అనునది వ్యక్తుల యెడల కనుపరచబడు సహనమును, *hupomonē* అనునది విషయముల యెడల కనుపరచబడు సహనమును వ్యక్తము చేయుచున్నట్లు తెలియుచున్నది. దీర్ఘశాంతముగలవాడు, వానికి హానిచేయువారి విషయంలో, అట్టి వారి చేత సులభంగా రెచ్చగొట్టబడదు, లేదా కోపంతో వారి పట్ల మండిపడడు [2 తిమోతి 4:2]. సహనముగలవాడు. గొప్ప పరీక్షలు ఎదుర్కొనునప్పుడు, వాటిని సహిస్తూ, తన ధైర్యమును కోల్పోడు.[8]

*Makrothumia* సుస్థిరముగాను ప్రజల పట్ల సహనముతోను ఉండుట యను అభిప్రాయముతో కూడినదై యున్నది.[9] పౌలు ఇచ్చట ప్రజల మధ్య ఒకరితో నొకరికి గల సంబంధములతో వ్యవహరిస్తున్నాడు గనుక, రెండవ దృక్పథంతో సహనము అను పదాన్ని ప్రయోగించాడు. ఎఫెస్సులోని సంఘములో సమైక్యత ప్రబలియుండవలెనంటే, ఈ క్రైస్తవులు భేదాభిప్రాయముల విషయంలోను, వ్యక్తిగత బలాబలాలలోను ఒకరితో నొకరు సహనము గలవారై యుండుటకు నేర్చుకొనుట ఎంతో అగత్యమై యుండింది.

**ప్రేమతో ఒకనినొకడు సహించుచు** అను పదజాలము పౌలు సహనము గూర్చి చేయుచున్న వ్యాఖ్యానమును విస్తృతము గావిస్తుంది. "సహనమును ప్రదర్శిస్తూ" అనగా, ప్రజలలో కనుగొనబడు పొరపాట్లను మరియు భేదాభిప్రాయములను ఓర్చుకొనుట యని అర్థము. దేవుని సదుద్దేశమును ప్రపంచమునకు ప్రచురము చేయుటకు ఆయన సాధనమై యుండిన సంఘము గూర్చి పౌలు కలిగియుండిన దర్శనములో, సంఘము తన దృష్టిని బృహత్చిత్రముపై కేంద్రీకరించుటతో పాటుగా, ప్రజల బలాబలాలు మరియు భేదాల గూర్చిన గుర్తింపు కూడ కలిసియుండింది. వారు సాత్వికులును మరియు సహనముగలవారునై యుండుటకు వారిని ప్రేరేపించేది, "ప్రేమే" - గనుక ఇతరులకు మర్యాద ఇస్తూ, మేలు చేయుచు, వారు దేవుని ఉద్దేశమును నెరవేర్చులాగున వారిని ప్రోత్సాహింపవలెనని తీర్మానించుకొందురు. ప్రేమ లేకుండా, క్రైస్తవ ఐక్యము అసాధ్యము.

## ఐక్యమును కాపాడుకొనుట (4:1-2)

**1-2... సమాధానమను బంధము చేత ఆత్మ కలిగించు ఐక్యమును కాపాడుకొనుటయందు ...**

**వచనములు 1-2.** ఐక్యము నిమిత్తమైన మౌలిక వేదికను ఏర్పాటు చేసిన తరువాత, పిలువబడిన పిలుపునకు తగినట్లుగా నడుచుకొనుటలో సంఘము యొక్క **ఐక్యము** కలిసియున్నదని పౌలు నిర్దిష్టముగా చెప్పుచున్నాడు. ఈ క్రైస్తవులు **శ్రద్ధగలవారై** (*spoudazō*) యుంటూ, సంఘములో **ఆత్మ** కలిగించిన **ఐక్యమును** కాపాడుకొనుటకు ఎంత వరకైనా ప్రయాసపడుటకు వెనుకంజ వేయకూడనివారై యుండవలసి యుండింది. యేసు, "మన సమాధానమై యున్నవాడు" (2:14), యూదులను మరియు అన్యజనులకు "ఏక శరీరముగా చేసి" ఒకరితో నొకరిని మరియు దేవునితోను సమాధానపరచాడు (2:16). వారు అదివరకే క్రీస్తునందు ఏకము చేయబడిన ఈ **సమాధానమును బంధమును** (*sundesmos*) కాపాడుకొనుటకు శరీరములోని సభ్యులు సకల విధాలుగా ప్రయాసపడవలసి యుండింది.

సంఘములోని సమైక్యము సంరక్షింపబడుచు కాపాడబడవలెను ఏలయనగా క్రైస్తవులు సమాధానమునకును సమైక్యమునకును ప్రతినిధులై యున్నారు. ఈ సమైక్యము సంరక్షింపబడుట మాత్రమే కాదు, కానీ మనము ప్రదర్శించు వినయము, మృదుత్వము, సహనము మరియు ఒకరి యెడల మరొకరము కలిగియుండు దీర్ఘశాంతములో కనుపర్చబడవలెను. సంఘము ఏ యే విషయాల్లో సమైక్యముగా నిలిచియుండవలెనో యని చెప్పుచూ పౌలు ఏడు "ఒక్కటే" యను సత్యములు గల జాబితాను విప్పుచున్నాడు (4:4-6).

## అన్వయము

### తగినట్లుగా నడుచుకొను నడక యొక్క ఐదు లక్షణములు (4:3)

ఎఫెసీయులు తగినట్లుగా నడుచుకొనవలెనని వారిని సవాలు చేస్తూ, పౌలు ఇటువంటి నడకకు సంబంధించిన ఐదు గుణగణాలుగల ఒక పట్టిక నిచ్చాడు (4:1-3). ఈ ప్రవర్తనా చిహ్నములు లేనివాడు పౌలు వ్రాయుచున్న ఈ పత్రికలోని మిగిలిన ఆదేశములను వ్యతిరేకముగా తిరుగబడవచ్చును. ఏది ఏమైనా, ఈ గుణగణాలుండు చోట, క్రైస్తవుని ప్రవర్తన దేవుని పిలుపుకు సరిపడునదై యుంటుంది.

*వినయము* (4:3). మనము సంపూర్ణముగా వినయమనస్కులమై యుండాలి. వినయము అనంటే, మనల గూర్చి మనమే అణకువగలవారమై యున్నామని అనుకొనుట కాదు; వాస్తవానికి మనల గూర్చి మనము ఆలోచించుకొనకపోవుటయే వినయము. ఎంతైనా, మనకు దేవుని చేత పిలుపు ఇవ్వబడుటకు మనము చేసిందేమీ లేదు. ఆధ్యాత్మికముగా మనము ఏమై యున్నామో, అదంతా కేవలము దేవుని కృప వలననే అయియున్నాము. కాబట్టి, గర్వించుటకు ఎవ్విధంగాను తావు లేదు.

వినయమును ఒక సద్గుణముగా ఆర్జించుకొనుట గ్రీకులకును రోమీయులకును ఒక సమూలమైన భావమై యుండింది. "వినయము"ను సూచించు ప్రాచీన పదం గుణ శీలములోని మూలాన్నీ సూచిస్తుంది; అది నిందాజనకమైన గుణముగా పరిగణింపబడింది. క్రొత్త నిబంధన రచనలకు వెలుపల, బలహీనముగా లేక పిరికివాడుగా నున్న ఒకని గౌరవమునకు భంగము కలిగించు పద్ధతిలో ఈ పదము ప్రయోగింపబడింది.

క్రైస్తవులు ఒక క్రొత్త సంకల్పముతో నిండియున్న ఒక క్రొత్త పదమును ఆవిష్కరించుకొనాల్సి వచ్చింది. బైబిలు సంబంధమైన వినయము అనగా మనము ప్రదర్శించు వినయమునుబట్టి ఇతరులు వారి సౌలభ్యం కొరకు మనలను బలహీనమైనవారిగా ఎంచనీయకుండుటతో కూడినదై యున్నది, సరికదా మనకు ధైర్యము లేదని కూడ అది సూచించదు, సూచింపకూడదు. యథార్థమైన వినయము అనగా ఎటువంటి భావమైనను లేకుండా మన జీవితాల్లో దేవుని నేతృత్వమును అంగీకరిస్తూ, మనలను మనము ఉన్నది ఉన్నట్టుగా దేవుని సముఖమందు కుమ్మరించుకొనుటయే ఎందుకనగా ఆయన సహాయము లేకుండా మన నిత్య గమ్యమును మార్చుటకు మనము నిస్సహాయులముగానే నిలిచియుందుమని మనకు తెలియును.

వినయ మనస్కులమై యుండుట అనగా మనము మన హృదయములను మరియు మనస్సులను యేసు పైనే కేంద్రీకరించి యుండుట. ఇక మీదట మన సొంత జీవితములకు నేతృత్వము మనమే వహించము. విశేషంగా, మనము ఆయన నేతృత్వమునే, ఆయన ఆదేశములనే వెదుకుచుందుము. ఇక మీదట మన జీవితముల సింహాసనముపై ఆసీనుడై యుండునది అహం కాదు; యేసే.

*సాత్వికము* (4:3). వినయమునకు సాత్వికము లేక వినమ్రత చేదోడువాదోడై యుండవలెను. అలాగైతే, సాత్వికమనగా నేమి? అది పిరికితనము కాదు. "స్ఫూర్తి మరియు సాహసము" కొదువయై యుండుటయే "సాత్వికము" అని కొందరు నిర్వచిస్తారు, కానీ అది బైబిలు నిర్వచనము కాదు.

సాత్వికమునగా బలము లేకపోవుట కాదు. స్థిరంగా నిలువబడి యుండుటకు కూడ సామర్థ్యములేని జిగట చేప వలె అది జంకుకొంకుతో కూడిన వ్యక్తిత్వము కాదు. అది ఎదురైన వారందరితో ఏకీభవించునట్లు చేయు ఒప్పింపులేని మనస్తత్వంగలది కాదు. బైబిలు నిర్వచిస్తున్న వినయము "అధీనములో నున్న అధికారమై" యున్నది.

సాత్వికమునకు మూల గ్రంథంలో పౌలు ప్రయోగించిన పదము "ఒక అడవి జంతువును మచ్చిక చేయుట" అని అర్థమిచ్చింది. ప్రాచీన మధ్య ప్రాచ్యములో జాతి పెంపకానికి ప్రత్యేకింపబడిన అరేబియా దేశ గుఱ్ఱమును ఒకసారి గుర్తుకు తెచ్చుకొనండి. కొంత మంది కలిసి ఆ గుఱ్ఱమునకు పాశం బిగించి ఆ మీదట దానిని సాలలో కట్టివేయునట్లు అదుపులో పెట్టుదురు. ఆ గుఱ్ఱము నడుముపై జీను ఇంత వరకు ఉంచబడలేదు; తలపై గాని నోటివోగాని కళ్లెము పెట్టబడలేదు. ఇంత గొప్ప గుఱ్ఱమును ఉపయోగించుకొనగలుగునట్లు వారేంచేస్తారు? వారు దానిని "నలగగొట్టుదురు." అనగా, ఆ యా నేర్పులతో దానిని సంభాళిస్తూ, తలపై పగ్గము, నోటిలో కళ్లెము మరియు నడుముపై జీను ఉంచబడినప్పుడు అంగీకరించే పరిస్థితిని ఆ గుఱ్ఱమునకు కల్పిస్తారు. చివరకు, ఇంతటి శక్తిశాలియైన, ఉల్లాసవంతమైన ఈ జంతువు వారి అధీనము లోనికి వస్తుంది. ఆ గుఱ్ఱములో ఉద్రేకము మరియు శక్తి మరియు సత్తువ యింకా ఉన్నాయి, కానీ ఇప్పుడవన్నీ మరొకరి అధీనములో ఉన్నాయి. కాబట్టి వానిపై స్వారీ చేయువాని ఆదేశముల మేరకు వాడు ఇష్టపూర్వకంగా లోబడుచుండును. గ్రీకులు చెప్పుకొనుచుండినట్లు, వాడు "సాత్వికము చేయబడ్డాడు."

ఆధ్యాత్మికంగా చెప్పుకొంటే, మనలోని ప్రతి ఒక్కరిలో సహితము జరుగాల్సింది ఇదే. మనము ఈ లోకము లోనికి స్వయం తృప్తినిచ్చు ప్రేరణలు, కోరికలు, మరియు

ఆశయములతో కూడ జన్మనెత్తాము. ఇప్పుడు, నిరపేక్షమైన సాత్వికముతో, వీటన్నింటిని మన ప్రభువైన యేసు క్రీస్తు అధీనము లోనికి తీసుకొని రావలసి యున్నది. అది జరిగినప్పుడు, మన ప్రవర్తన సువార్త ద్వారా మనము పిలువబడిన పిలుపునకు తగినట్లుగా ఉంటుంది.

*సహనము* (4:3). మనము పిలువబడిన పిలుపునకు తగినట్లుగా నడుచుకొనుచున్నవారమై యుండవలెనంటే మనము సహనము గలవారమై యుండాలి. "సహనము" అని అర్థమిచ్చుచున్న ఈ పదము విషయంలో ప్రాచీన గ్రీకులు రెండు మాటలను ఉపయోగించుచుండిరి. ఒక మాట ప్రజలు పరిస్థితులతో ఎలా వ్యవహరించుచుండిరో తెలియజెప్పునదై యుండింది; రెండవది ప్రజల మధ్య ఒకరితో నొకరు కలిగియుండిన సంబంధములకు సంబంధించినదై యుండింది. పౌలు రెండవ అభిప్రాయముతో కూడిన పదాన్ని ప్రయోగించాడు.

సహనము కలిగియుండుట అనగా, మన మనస్సును గాయపర్చిన వారి యెడల పగ తీర్చుకొనుటలో నిదానము పాటించుటయై యున్నది. వాస్తవానికి, సహనముగలవాడు తన యెడల చేయబడిన గాయమును పరిగణలోనికి తీసుకొనుటకు సహితము దీర్ఘ కాలము పట్టును. పౌలు ప్రయోగించుచున్న పదమునకు "దీర్ఘమైన బావోద్రేకము కలిగియుండుట" యని అర్థమిచ్చుచున్నది. మనము ఇతరుల యెడల పెంకితనము ప్రదర్శించము లేదా కోపము తెచ్చుకొనము.

తగినట్లుగా నడుచుకొనుట యనగా మనము సరైన పనులు చేసినందునుబట్టి ఎదురయ్యే అవమానము, హాని, హింస, అన్యాయమైన వ్యవహారము, ద్రోహము, అపవాదులు, విమర్శ, ద్వేషము, మరియు ఈర్ష్య మొ॥ వాటిని సహించుట యని అర్థము. అది వ్యతిరేకార్థక పరిస్థితులను మరియు అట్టి పరిస్థితులకు కారణమగు ప్రజలను ఎటువంటి విద్వేషమైనను లేదా అసంతుష్టియైనను లేకుండా అంగీకరించుటయై యున్నది.

ఇది హేతుబద్ధం కానిదిగా కనబడుతుందా? అలాగైతే, లోకం పోకడకును మన నడవడికిని ఏముంటుంది? మన ప్రభువైన యేసు క్రీస్తు అలా జీవించినట్లయితే – వాస్తవంగా ఆయన అలా జీవించాడు – అట్టి గుణగణములుగల జీవితము జీవించుటకు మనము కూడ పిలువబడి యున్నాము.

*దీర్ఘశాంతము* (4:3). మనము ప్రేమతో ఒకని నొకడు సహించవలసి యున్నది. ఈ దీర్ఘశాంతమునకును సహనమునకును గల తేడా ఏమిటి? ఇది సహనముతో కూడిన అంతరంగా స్ఫూర్తి ఆచరణాత్మకంగా ప్రదర్శింపబడుటయై యున్నది. ఇతరుల యెడల దీర్ఘశాంతము చూపుట యనగా మనము వారి పొరపాట్లను లేక లోపాలను చూడలేని అంధులము కాదని అర్థం. కానీ, మనము పరిపూర్ణులముకామని మనము గుర్తించు కొలది, ఇతరులు కూడ పరిపూర్ణులు కారని మనము అంగీకరిస్తాము. "నేను అయిష్టముతో ఇతనిని/ఈమెను అంగీకరిస్తున్నాను" అని మనము సామాన్యముగా చెప్పకుందుము. దానికి బదులుగా, ప్రేమ పూర్వకంగా, మనము ఆ వ్యక్తికి ఉపచారము చేయుచుందుము, అతని/ఆమె సంపూర్తి సంక్షేమమును కోరుకొందుము. అనగా, అవతలి వ్యక్తి కూడా క్రీస్తు శరీరములో పరిపక్వత చెందుటకు ప్రయాసపడుచుండును గనుక ఇది విఫలతకు తావిచ్చు మరొక క్రైస్తవ విశ్వాసి యెడల కనుపర్చబడు అమితోత్సాహముగల ప్రేమతో కూడిన వైఖరై యున్నదని మరొక మాటలో చెప్పుకొనవచ్చును.

*సమైక్యము కొరకైన శ్రద్ధ* (4:1–2). సంఘములోని సమైక్యత కొరకైన మంట హృదయములో లేకుండా దేవుని యెదుట తగినట్లుగా నడుచుకొనుట యనునది ఉండదు. మనము ఇంతకు మించిన సమైక్యము యొక్క ఒక గొప్ప అవగాహన కొరకు సామాన్యముగా ఆశించజాలము; మనము ఒకరితో నొకరము కలిగియుండు సంబంధములలో దీనిని వాస్తవము గావించుటకు మనము "శ్రద్ధగలవారమై" యుండవలెను. పౌలు ప్రయోగించిన "శ్రద్ధ" అని అర్థమిచ్చుచున్న పదములో రెండు గ్రీకు మాటలు కలిసియున్నవి. వాటిలో ఒక దాని అర్థము, "వేగిరపడుట"; రెండవది, ఆతురతతో కూడిన తీవ్రమైన ప్రయాసముగలదను ధ్వనింపు నిచ్చుచున్నది. రెండూ కలిసి, పౌలు మాటల అర్థము ఈ విధముగా నున్నది: "మనము వేగిరపడి సమైక్యమును సాధించుటకు ప్రయాసపడుదము!"

అయినప్పటికినీ, ఒక విషయం గమనించండి, ఏమనగా ఐక్యమును కలుగజేయుట మన పని కాదు. ఇట్టి ఐక్యమును యేసు క్రీస్తు సిలువపై చిందించిన రక్తము ద్వారా దేవుని ఆత్మ క్రీస్తు నందు మనకు కలుగజేయుచున్నాడు. దేవుడు మనలనందరిని ఒక్క శరీరముగా చేసినందునుబట్టి మనమందరమును దేవుని దృష్టిలో ఐక్యతగలవారమై యున్నాము. మనం అనుదినము ఒకరితో నొకరము కలిగియుండు సంబంధములలో సమైక్యమును సమాధానముతో కాపాడుకొనుటకు మనము మన శాయశక్తులా ప్రయాసపడుట పిలువబడిన పిలుపునకు తగినట్లుగా నడుచుకొను నడక లక్షణమై యున్నది. మనము ఒకరితో నొకరము కలిగియుండు సహవాసమును కాపాడుకొనుటకు మనము సకల ఆధ్యాత్మిక అవసరములను ఇచ్చిపుచ్చుకొనుచుందుము. ఇతరులకు విరోధముగా చేసిన పాపములను ఒప్పుకొందుము; మనము తీర్మానములు యుద్ధప్రాతిపదికన చేసుకొందుము; అవతలి వ్యక్తి అడుగక మునుపే మనము వారిని క్షమిస్తాము. తెగిపోయిన ఒక సంబంధమును పునరుద్ధరించుటకు చొరవ తీసుకొనడమును మించినది మరేదైనాగాని మనము దేవుని పోలియున్నవారముగా చేయగలదా? సంఘము దాని సమైక్య స్ఫూర్తిని కాపాడుకొనునట్లు సహాయము చేయుటకు మనము చూపించు గొప్ప శ్రద్ధ, దేవుడు మనకిచ్చిన పిలుపునకు తగినట్లు మనము ఎంత చక్కగా నడుచుకొనుచున్నామో ప్రతిబింబిస్తుంది.

క్రిస్ బుల్లార్డ్

---

సూచనలు

[1]"నడుచుకొనుడి" యను పదమును ఒక విశిష్టమైన మందలింపుగా ఉపయోగించుచున్న వచనములు 4:1–3; 5:2, 10, 15–16. ఈ నాలుగు నడకలపై తమ దృష్టిని కేంద్రీకరించుచున్న వాక్య భాగములు 4:1–32; 5:1–7; 5:15–6:20. [2]Andrew T. Lincoln, *Ephesians,* Word Biblical Commentary, vol. 42 (Dallas: Word Books, 1990), 234. [3]Ibid., 94. [4]Ethelbert W. Bullinger, *A Critical Lexicon and Concordance to the English and Greek New Testament* (London: Samuel Bagster and Sons, n.d.; reprint, Grand Rapids, Mich.: Zondervan Publishing House, Regency Reference Library, 1975), 904. [5]Lincoln, 235. [6]S. D. F. Salmond, "The Epistle to the Ephesians," in *The Expositor's Greek Testament,* ed. W. Robertson Nicoll (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1967), 3:320. [7]Lincoln, 236. [8]Richard C. Trench, *Synonyms of the New Testament* (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1953), 198. [9]Lincoln, 236.